త్రైలోక్యగీత
ద్వాదశాధ్యాయము

కృష్ణ తత్త్వ జ్ఞాన యోగము

త్రైలోక్యా ఉవాచ:-

వివృణు త్వం పునః ప్రోక్తం, దత్త! పండిత పండిత! |
పామరేభ్యో వినా తర్కం, యదిదం సూక్ష్మవత్తమమ్ ||12.1||

[త్రైలోక్య ప్రశ్నించినది,-
ఓ దత్తదేవ! పండితులందరిలోనూ పండితుడవైన దత్త! పామరులకు అర్థమయ్యేలా తర్కవిశ్లేషణ అవసరము లేని విధంగా ఇదే విషయసారమును మళ్ళీ వివరించగలరు. ఎందుకంటే ఈ జ్ఞానము అతి సూక్ష్మము, అతిసున్నితము.]

శ్రీశ్రీశ్రీ దత్తస్వామీ ఉవాచ:-

త్రైలోక్యే! కరుణాచిత్తే!, ప్రవృత్తి నియమాః కృతాః |
తేనాతీతేన వినతః, స్వకృతస్య పురస్స్వయమ్ ||12.2||

[ఓ కరుణా మనస్కురాలైన త్రైలోక్య! గత అధ్యాయములో వివరించిన జ్ఞానము నీకు పూర్తిగా అర్థమైనప్పటికీ, సాధారణ జనుల పట్ల నీవు దయ చూపుతున్నావు. ప్రాపంచిక జీవితంలో జీవాత్మలు అనుసరించ వలసిన న్యాయధర్మములు అనగా ప్రవృత్తి నియమాలు భగవంతుడు రచించినాడు. కాబట్టి న్యాయము, ధర్మము ఎప్పటికీ భగవంతుని కంటే ఎక్కువ కాదు. ఎందుకంటే, ఈ న్యాయము, ధర్మము మార్గములో ప్రయాణించిన జీవాత్మలు భగవంతుని మనసును చూరగొనడమే ఈ మార్గమునకున్న లక్ష్యము. సృష్టిని, దానికి నియమాలను సృష్టించిన సృష్టికర్త ఎప్పటికీ సృష్టి కంటే ఉన్నతుడు. కావున న్యాయము అనేది

భగవంతుని సృష్టిలోని ఒక భాగము. భగవంతుడు యథార్ధసత్యమైతే, ఈ సృష్టి అంతా కూడా సాపేక్ష సత్యము. కాబట్టి ఈ ప్రపంచము కాని, ఈ నియమాలు కాని భగవంతుని కట్టలేవు. కాకపోతే నియమాలు రచించిన కర్త, తన నియమాలను తానే అనుసరించక పోతే, అహంభావిలా కనిపించినట్లైతే జీవాత్మలకు తాను ఆదర్శం కాలేడు కావున ధర్మమును ఎల్లప్పుడూ అనుసరిస్తాడు.]

ధర్మోధర్మ హరః శ్రేష్ఠః, నియంతా జీవ విగ్రహః |
విశ్వశాంతి కరో జ్ఞాన-భక్తిర్ధీః వ్యక్త కర్మ చ ||12.3||

[ప్రవృత్తిలో న్యాయము, ధర్మమునకే ఎప్పుడూ పెద్దపీట. జీవాత్మలు న్యాయము, ధర్మమును అనుసరించి దుష్ప్రవృత్తిని పాపకర్మలను నిరోధించవలెను. దుష్ప్రవృత్తిని పాపకర్మలను నియంత్రించుటకు జీవాత్మలకు న్యాయధర్మములు సిఫారసు చేయబడినాయి. కాని దృశ్యములోకి భగవంతుడే అడుగిడినప్పుడు తనకు కూడా నీవు ఇవే నియమాలను విధించలేవు, ఎందుకంటే ఈ నియమాలు అన్ని జీవాత్మలు తమ తోటి జీవులతో ప్రవర్తించునపుడు తమ పరిధిలో తాముండగల విధానమును నిర్ధారించేవి. వీటి ద్వారా ప్రపంచంలో శాంతి పరిరక్షింపబడుతుంది. జ్ఞానము, ప్రేమ లేదా భక్తి అనేవి భావరూపపక్షము లోనివి, అయితే కర్మ చేయునపుడు అంతర్గతమైన భావనలు ఆచరణీయపక్షములోకి వస్తాయి.]

కర్మానుఫలమాయాతే, తస్మిన్నూర్ధ్వ నివృత్తయే |
యా జీవేశ్వరయోస్సైస్వైరం, ప్రవృత్తిర్బలవత్తమా||12.4||

[మంచి కర్మలకు మంచి ఫలితములు ఇవ్వబడతాయి. చెడుకర్మలకు చెడ్డ ఫలితాలు ఇవ్వబడతాయి. కర్మ దిశను బట్టి, అదే కర్మకు వేర్వేరు (మంచి లేదా చెడు) ఫలితాలు ఇవ్వ

బడతాయి. ఎప్పుడైతే నరావతారముతో భగవానుడు దృశ్యములోకి వస్తారో (జీవితము లోకి), ఇక విషయము ప్రవృత్తిని మించి పోయి నివృత్తి అవుతుంది. భగవంతుడు మరియు జీవాత్మల మధ్య గల సంబంధము నివృత్తి పరిధి లోకి వస్తుంది, ఇది పూర్తిగా జీవాత్మ యొక్క వికల్పము (ఇష్టమునకు సంబంధించిన విషయము). ప్రాపంచిక జీవితము లేదా ప్రవృత్తి నిర్దిష్టమైన శాసనాంశము, అయితే నివృత్తి లేదా ఆధ్యాత్మిక జీవితము పూర్తిగా జీవాత్మ ఇష్టానికి వదలి వేయబడినది.]

భక్తారామం స్త్రియో భూత్వా, పరిరబ్ధుముపాగతాః |
నివృత్తేస్సృష్టిశక్త్యాఽస్య, తేషాం కామ విదూరతః || 12.5||

[శ్రీకృష్ణుడు గోపికల మధ్యనున్న బంధము- నివృత్తి. ఈ జన్మలో నిరక్షరులైన గోపికలు తమ పూర్వ జన్మలలో ఋషులు కావున జ్ఞానమును పూర్తిగా అర్థము చేసుకుని జీర్ణించుకుని గత జన్మలోనే భగవంతునిపై అమితమైన ప్రేమ వృద్ధి చేసుకుని భగవానుడైన శ్రీరాముని కౌగిలింపగోరి, తమ మహిమాశక్తి చేత స్త్రీలుగా మారాలనుకున్నారు. అయితే, రాముడు అనుమతించలేదు. అలాగే గోపికలతో అనైతిక కామకేళి పట్ల భగవానుడైన శ్రీకృష్ణునికి ఏ మాత్రము ఆసక్తి లేదు, సంకల్పమాత్రము చేత అత్యంత సౌందర్యవతులైన స్వర్గలోకపు నర్తకీమణులే తన ముందు, వరుసకట్టి నిలబడగలరు. కామమునే తాను కోరితే అనూహ్య సౌందర్యము గల ఒకానొక స్త్రీని సృష్టించుకోగలడు. అంతేగాని ఇటువంటి స్పర్థాపూర్వక పరిస్థితిని కల్పించుకోవడము ఎందుకు? ఇదే పరిస్థితి రెండవవైపు కూడా ఉన్నది. ఋషులు కఠినమైన తపస్సు చేస్తుండగా ఎందరో స్వర్గలోక సుందరీమణులు వారి ముందుకు దిగి తమ నృత్యముతో ఆకట్టుకుని వారి మనసు దోచుకొన ప్రయత్నించి విఫలురైనారు. అలాంటి ఋషులు బాహ్య సౌందర్యమును చూసి, హార్మోన్ల వలన శారీరక ఉద్రేకముతో కామమును పొందుతారా? కేవలము భగవంతునిపై గల

అవ్యాజమైన ప్రేమ కారణముగా ప్రాపంచిక బంధములన్నింటి నుండి సంపూర్ణముగా విముక్తి పొందడానికి, మిగిలిపోయిన ఒకే ఒక బలహీన బంధము అయిన జీవిత భాగస్వామి బంధమును ఇలా దాటినారు.]

జ్ఞాన భక్తాః ప్రేమ కామః, కామకామా న చాగ్నయః |
శివః కృష్ణః కామదాహః, సూత్రాజ్ఞానంతి తం హి తాః ||12.6||

[వారి ప్రేమ లేదా భక్తి సత్యమైన జ్ఞానము నుండి ఉద్భవించినవి. శ్రీకృష్ణుని యందు వారికి గల ఆకర్షణకు కారణము ఆతని దివ్య కళ్యాణగుణములే కాని అతని అందమైన శరీరము కాదు. కావున వారి కామమునకు ప్రేమ ఆధారమైనది. ఎందుకంటే తపస్సు అనే అగ్నిలో ఋషులు కామస్వభావమును ఎప్పుడో కాల్చి బూడిద చేశారు. ఇకపోతే కృష్ణుడే విష్ణువు, విష్ణువే శివుడు. కావున కృష్ణుడే శివుడు, అంటే ఇతడు కామదేవుడైన మన్మథుడిని నిలువునా కాల్చినవాడు. ఇరువైపుల వారి స్థితి అత్యున్నతము. సర్వకాల సర్వావస్థల యందు శ్రీకృష్ణుడే భగవంతుడని గోపికలకు స్పష్టముగా తెలుసును. ఈ జ్ఞానము ఆధారముగా ఏర్పడిన ప్రేమయే కామముగా మారినదని నారద మహర్షి భక్తిసూత్రములలో తెలియజెప్పారు.]

ధర్మ్యాధర్మ్యౌ ప్రేమ కామౌ, ద్వయోః కామోఽంతిమః ఫలే |
స్వర్లోక నరకౌ ప్రోక్తః, తప్తాశ్లేషో మురారిణా ||12.7||

[ప్రేమ, కామములలో రెండు రకములున్నవి. 1. ధర్మబద్ధమైన ప్రేమ ఆధారిత కామము 2. అనైతిక ప్రేమ ఆధారిత కామము. మొదటిరకములో, ధర్మబద్ధమైన భర్త యొక్క సుగుణములను తెలిసి, అతని ఆంతరంగిక వ్యక్తిత్వమును తెలుసుకొనుట చేత ఏర్పడిన కామము. రెండవది కేవలం శారీరక కారణాలచే, హార్మోన్ల ప్రభావముతో ఏర్పడిన కామము, అంతేకాక ఇది అనైతిక

బంధాలకు ఆకర్షితమైనది. కాని ధర్మబద్ధమైన ప్రేమ ఆధారిత కామము లోనైనా, అనైతిక ప్రేమ ఆధారిత కామములోనైనా చివరి కర్మ మాత్రము ప్రత్యక్షమైన కామక్రియ అవుతుంది. కాని వాని ఫలితములును గమనిస్తే ధర్మబద్ధమైన కర్మకు అందే ఫలితము స్వర్గము, అనైతిక కర్మకు అందే ఫలితము నరకము. గోపికలు తమ భర్తలను మోసగించినట్లైతే నరకమునకు వెళతారని, అనైతికమార్గములో రాత్రిని గడిపినట్టి వ్యక్తి యొక్క ఎర్రగా కాలిన రాగివిగ్రహమును అక్కడ కౌగిలించుకోవలసి వస్తుందని శ్రీకృష్ణుడు భయపెట్టినాడు మరియు హెచ్చరించినాడు.]

విరహోష్మాఽధికం తస్మాత్, కృష్ణానంద ఇతీరితమ్ |
సర్వాధికో వృత సస్సర్వ- బంధపాతాస్తమాశ్రితాః ||12.8||

[గోపికలకు కృష్ణునిపై గల ప్రేమ ఎంత అంటే వారికి శ్రీకృష్ణుని ఎర్రగా కాలిన రాగివిగ్రహమును కౌగిలించుకోవడము కూడా చెప్పలేనంత ఆనందకరమని, అసలు వారికి ఆ శిక్ష, శిక్ష కానే కాదని, ఎందుకంటే శ్రీకృష్ణుని విరహవేదన అనే అగ్ని యొక్క వేడిమి, ఎర్రగా కాలిన రాగివిగ్రహపు వేడి కంటే చాలా ఎక్కువ అని చెప్పారు. శ్రీకృష్ణుడే వారికి అందరి కంటే ఎక్కువ, అన్నింటి కంటే ఎక్కువ, కావున శిక్షను వారు పూర్తి ఆనందముతో అంగీకరించారు. సంపూర్ణ శరణాగతి అంటే భగవంతునితో బంధము ఏర్పరచుకుని, వందశాతము ప్రాపంచిక బంధాలన్నింటి నుండి విముక్తి పొందడమే.]

దారేషణా బలే హీనా, పరే ఛిన్నే భవాంతిమే |
కుతోఽల్పేత్యత్ర సుమహాన్, తర్కో లాభవదక్షయః || 12.9||

[ప్రాపంచిక బంధాలన్నింటిలో చాలా బలమైనవి మూడు ఏషణలు. అవి ధనేషణ, దారేషణ మరియు పుత్రేషణ. ఒక్క బలహీనమైన దారేషణ (భార్యాభర్తల మధ్య గల బంధము) తప్ప, ఋషులైన

గోపికలు బలమైన ఏషణలను అన్నింటినీ ఇదివరకే దాటివేసినారు. దారేషణ ఒక్కటే బలహీనమైన బంధము, ఎందుకంటే ఈ ఒకే ఒక్క బంధమునకు ప్రపంచములో విడాకులు అనే న్యాయబద్ధమైన విడుదల పద్ధతి కూడా ఏర్పాటై ఉన్నది. ఇప్పుడున్న ప్రశ్న ఏమిటంటే, అన్ని బలమైన బంధాలను దాటగలిగినప్పుడు మరి చివరిజన్మ వరకు ఈ బలహీనమైన బంధమును ఎందుకు దాటలేకపోయారు? అని. ఇది ఎంతటి బలహీనమైన బంధము అయినా సరే దీనిని కూడా దాటితే తప్ప వందశాతము ప్రాపంచిక బంధాల నుండి విముక్తి పొంది సంపూర్ణ శరణాగతి పొందినట్లు కాదు. అంటే భగవంతునితో బంధము కారణంగా, ఈ బలహీనమైన దారేషణ అను బంధముతో సహా, బలమైన ప్రాపంచిక బంధాలన్నింటి నుండి విముక్తి పొందడమే నివృత్తి. ఒకవేళ అన్ని బలమైన బంధాల కంటే ముందు ఈ బలహీనమైన బంధాన్ని దాటిపోయినా, సాధించగల ఫలితము ఏమీ ఉండదు. ఎప్పుడైనా బలమైన పరీక్ష ముందుగా నిర్వహించిన తర్వాత బలహీనమైన పరీక్ష జరుపడము సమంజసము. ఏది ఏమైనా, పరీక్షలన్నీ ఉత్తీర్ణత పొందితే గాని అంతిమ ఫలితము లభించదు. ఒకవేళ అన్ని బలమైన బంధాల కంటే ముందు ఈ బలహీనమైన బంధాన్ని దాటిపోయినా, అంతిమ ఫలితము ఎలాగూ రాదు, పైగా ఈ బలహీనమైన బంధమును దాటిన నేరమునకు నరకములో శిక్ష పడక తప్పేది కాదు, అంటే ఉపయోగమేమీ లేదు పైగా మరింత నష్టము! బలహీనమైన బంధాన్ని దాటడము అంటే, బంధాలన్నీ ఉండగానే అనైతిక కామకేళి అనే 'పాపకర్మ' చేయడము అవుతుంది. ఒకవేళ అన్ని బలమైన బంధాల తర్వాత కూడ ఈ బలహీనమైన బంధాన్ని దాటితే, అంతిమ ఫలితము రావడమే కాక ఈ బలహీనమైన బంధాన్ని దాటడము వలన ఏ పాపమూ రాదు. ఈ విధమైన సంక్లిష్టధర్మము ఇమిడి ఉన్నందున భగవంతుడు బలహీనబంధము అయిన దారేషణను చివరిదైన స్త్రీజన్మలో పరీక్షించారు. బలహీనమైన బంధపరీక్ష చివరిజన్మలో

నిర్వహించినందున లాభమే (సంపూర్ణ ముక్తి) తప్ప నష్టము (దారేషణ దాటినందుకు నరకంలో శిక్ష) పొందలేదు. అంతటి బలమైన బంధాలు దాటితే అది పాపకర్మగా పరిగణించలేదు కాని బలహీనమైన దారేషణ దాటడము పాపకర్మ అవుతుంది. పరీక్షలన్నింటిలో చివరలో దారేషణ దాటడము ధర్మబద్ధమైనది, ఎలాగంటే ఇది పాపకర్మను అంటుకోదు, ఈ చివరి పరీక్ష పూర్తి అయితేనే గాని సంపూర్ణ మోక్షము అనే ఫలితము పొందబడదు. ఈ విధముగా బలహీనమైన బంధ పరీక్ష చివరిజన్మలో నిర్వహించినందున సంపూర్ణ ముక్తి అను లాభముతో పాటు నష్టము అయినటువంటి బలహీనమైన దారేషణ దాటడము వలన పాపకర్మకు శిక్ష (నష్టము) కూడా తప్పుతున్నది. కావున బలహీనమైన దారేషణ పరీక్ష చివరిదైన స్త్రీజన్మలో నిర్వహించడము వెనక ఇంతటి లోతైన తర్కవిశ్లేషణ ఇమిడి ఉన్నది.]

స్త్రీణాం క్లేశో హ్యంత్యబంధే, పుత్రబంధేఽప్యహంతయా |
లింగాత్తయా మోక్షవత్యా, కృతశ్చరమ నిశ్చయః || 12.10||

[స్త్రీజన్మ చివరగా ఉన్నందున దారేషణను దాటడము పురుషులతో పోలిస్తే స్త్రీలకు చాలా కఠినమైన అంశము. దీనితో పాటు మరో పరీక్ష కూడా జరుపబడినది. ధనేషణ, పుత్రేషణ పరీక్షలు కూడా జరిగినాయి. ఎందుకంటే తొమ్మిది నెలలు గర్భంలో మోసి కనే తల్లికి సహజముగానే తండ్రి కంటే ఎక్కువగా సంతానముతో బంధము బలమైనదై ఉంటుంది. ఇంకా స్త్రీ జన్మ చివరగా ఇచ్చినపుడు వారిలో పురుషాహంకారము పూర్తిగా నశిస్తుంది. ఈ చివరి జన్మలో ప్రాపంచిక బంధాల నుండి ముక్తి పొందడమే కాదు, లింగాహంకారపు గుర్తులు కూడా తుడిచి వేయబడతాయి. ఈ విధంగా జీవాత్మ సమస్త ప్రాపంచిక బంధముల నుండి మరియు సంపూర్ణ అహంకారము నుండి విముక్తి పొందగలదు. పురుషజన్మలలో, ప్రయత్నపూర్వకముగా ఇదివరకు పేరుకుపోయి

ఉన్న జ్ఞానాహంకారమును, ధనాహంకారమును నశింపజేసుకోగలరు. కాని లింగాహంకారము నుండి మాత్రం పూర్తిగా ముక్తి పొందలేరు. కాని ఒక్కసారి జీవాత్మ స్త్రీగా జన్మిస్తే ఇక పురుషాహంకారము ఏమాత్రమూ ఉండదు. కావున ఇన్ని కారణాలతో ఒక జీవాత్మ భగవంతునితో బంధము కోసము ప్రాపంచిక బంధాల నుండి సంపూర్ణవిముక్తి పొందే ముందు తన చివరిజన్మలో స్త్రీ జన్మను తీసుకొనవలసి ఉంటుంది. భగవంతునితో బంధము లేకుండా కేవలము ప్రాపంచిక బంధాల నుండి విముక్తి పొందడము శుద్ధ వ్యర్థ ప్రణాళిక, అంతే కాదు, ఇది మూర్ఖత్వము కూడా. భగవంతునికి స్థానము లేనటువంటి శుద్ధ విముక్తి నిరుపయోగకరము.]

ఋషీణామంతిమం జన్మ, ప్రమాణం వ్రజయోషితామ్ |
న విద్యాఽపి చ మేధావీ, స మాన్యోఽపి సుతర్కవిత్ ||12.11||

[పైన వివరించినట్లు, సంపూర్ణ మోక్షమును పొందే ముందు స్త్రీజన్మ రావలసినదనే విషయమును ఋషుల చివరి జన్మలో గోపికలుగా రావడము ధ్రువీకరిస్తున్నది. ఓ త్రైలోక్య! పామరులు ఇంతటి కీలక విషయములో నా సంక్లిష్ట విశ్లేషణను అందుకోలేరని నీకు సంశయము వలదు. కారణమేమిటంటే, అక్షరజ్ఞానము లేకపోయినా సాధారణ జనులు విషయవిశ్లేషణ సరిగా చేయగల వారు, చాలా తెలివైనవారుగాను, విజ్ఞులు గానూ అయి ఉంటారు.]

రహస్యం యదబోధ్యం సత్, యద్యసత్ నిరయప్రదమ్ |
యోగశాస్త్ర వక్రగతేః, నృత్య మర్థ నిశాగతమ్ ||12.12||

[శ్రీకృష్ణుడు మరియు గోపికల నడుమ రాసలీలల వెనక రహస్యమును ఎవరూ అర్థము చేసుకోలేరు. ఈ విషయమును అపార్థాలతో చూసినట్లైతే ప్రాపంచిక శాంతికి భంగము కలుగవచ్చుననీ, లేదా స్వార్థప్రయోజనాలు కోరి జనులు వక్రదృష్టితో చూసి దురుపయోగము చేస్తారనీ రహస్యముగా

నిర్వహించబడినాయి. బృందావనములో అర్ధరాత్రి పన్నెండు గంటల నుండి తెల్లవారుజామున నాలుగు గంటల వరకు జరిగిన నృత్యముల రహస్యము శ్రీకృష్ణుని చేత నెరవేర్చబడినది. ఈ విధముగా గోపికల కుటుంబాలలో అలజడి కలుగనీయలేదు. ఒకవేళ ఇది ప్రాపంచిక పాపకర్మ అయి ఉంటే, రహస్యముగా ఉంచినందుకు పాపఫలితము రెట్టింపు అయ్యేది. శ్రీకృష్ణుడు సాధారణ అనైతిక మానవుడు కాదు, సాక్షాత్ భగవంతుడు. కావున రహస్యాత్మకత యొక్క అంతరార్థము తెలియక, పాపకర్మ అని అపార్థము చేసుకోరాదు. భగవంతునితో భక్తునికి ఉండే బంధము ఎప్పుడూ కుటుంబ సభ్యుల మధ్య రహస్యముగా ఉంచి, కుటుంబ సభ్యులు భక్తుని ఆధ్యాత్మిక మార్గములో జోక్యము చేసుకోకుండా శాంతిని నెలకొల్పమని భగవద్గీతలో చెప్పబడినది. (**ఆత్మానం రహసి స్థితః, రహస్యం హ్యేతదుత్తమమ్**). యోగశాస్త్రములో కూడా వక్రగతిలో జీవాత్మ గమనము (కుండలినీ), భగవంతుని చేరు భక్తి మార్గము అవసరమైనచో మాయాపూరితమని ధ్రువీకరిస్తున్నది. ప్రాపంచిక బంధముల దృష్టికి రాకుండా భగవంతునిపై భక్తిని వృద్ధి చేసుకోవడము పాపకర్మ కానే కాదు. ప్రవృత్తిలో మాత్రము అనైతిక ప్రాపంచిక బంధము ఘోరపాపము. నివృత్తి యందు గోపికల నుండి ప్రేరణ పొందిన ఆదిశంకరాచార్యులు భగవంతుని బంధము కొరకు తన తల్లిని త్యజించినారు.]

సదప్యసదివ వ్యక్తం, గృహీతాఖిల దండనాత్ |
సర్వ కోణై స్స దేవోఽపి, దండః స్వప్రేమ దర్శనే||12.13||

[గోపికలు చేసిన కర్మ ధర్మబద్ధమైనది. అయినా, నరావతారుడు అయిన శ్రీకృష్ణుడు వారి వర్తమాన పాపకర్మనే (పాపకర్మ కాకపోయినా పాపకర్మగా పరిగణించి) కాకుండా గతించిన పాపకర్మల ఫలిత భారమును కూడా తన పైకి తీసుకోవడమును చూసి సాధారణ జనులు శ్రీకృష్ణ గోపికల చర్యలను అనుకరించడానికి

భయపడతారు. శ్రీకృష్ణుడు భగవంతుడే అయినా కృష్ణ-గోపికల మధ్య జరిగినది పాపమే అని నిర్ణయించి జనులు గోపికలను అనుకరించడానికి భయపడతారు. గోపికల పూర్వ పాపకర్మలను నశింపజేయగల అధికారము ఉన్నప్పటికీ శ్రీకృష్ణుడు అలా చేయలేదు. తాను ఎంతో పెద్ద పర్వతమైన గోవర్ధనమును చిటికెన వేలుమీద ఎత్తి దివ్యత్వమును చూపినారు. ఇలాంటి దివ్యత్వమును చూపుట ద్వారా మానవ మాత్రులెవ్వరూ తాను గోపికలతో ప్రవర్తించినట్లు అనుకరించరాదని బోధించినారు. అయితే, కేవలం గోవర్ధనమును చిటికెన వేలుమీద ఎత్తడం దివ్యత్వమును తెలపదు, ఎందుకంటే రాక్షసుడైన రావణుడు అంత కంటే పెద్దదైన కైలాస పర్వతమును ఎత్తినాడు. మహిమలు *చేయడముతో పాటు అద్భుతమైన ఆధ్యాత్మిక జ్ఞానమును భగవద్గీత రూపములో బోధించినందుకు, ఊహింప వీలు కాని ప్రేమను తన భక్తులపై చూపడమును (తన నివాసము పైన గోపికల కోసము గోలోకము సృష్టించడము) బట్టి మాత్రమే భగవంతుని దివ్యత్వమును నిర్ధారించవలెను.* ఈ విధంగా శ్రీకృష్ణుడు అన్ని కోణాల ద్వారా భగవంతుడని దృవీకరించబడినది. అతడు గోపికల ప్రేమను ఎంతగా ఆనందించాడు అంటే వారి పాపకర్మలు పూర్తిగా తటస్థము చేయగల సామర్థ్యము ఉన్నప్పటికీ తానే వాటిని ఉత్సాహముతో అనుభవించి గోపికల పట్ల తన ప్రగాఢమైన ప్రేమను తెలియ బరచినాడు.]

అంగీకారాత్ ఫలన్యాసః, విద్యతే శాస్త్ర గోచరః |
అంగీచక్రుర్మహాబాధా, విరోధాదితి తద్గిరః ||12.14||

[భగవంతుడు సృష్టికి నిర్దేశించిన రాజ్యాంగములో ఒక నిబంధన ఉన్నది. కర్మను ఒక జీవాత్మ చేసినపుడు, రెండవ జీవాత్మ పరస్పర ఒప్పందముతో మొదటివాని కర్మ ఫలితమును అనుభవించవచ్చును. ఒక మనిషి అనారోగ్యము పాలై

నిత్యభగవత్సేవా విధులు (సంధ్యావిధులు) నిర్వహించ లేకపోతే తన తరపున ఎవరినైనా చేయమని పరస్పర ఒప్పందముతో ఫలితము తీసుకోవచ్చును. శాస్త్రములను అనుసరించి భర్త చేసిన భగవదారాధనలో సగము తన ధర్మపత్నికి చెందుతున్నది. ఇది, కర్మఫలితములు ఒకరి నుండి మరొకరికి అందుతాయని ప్రమాణీకరిస్తాయి. తప్పనిసరిగా ఇది భార్య నుండి భర్తకు సంక్రమించిన కర్మఫలము (సృష్టిలోని ప్రతి ప్రాణి స్త్రీలింగమే, భగవంతుని భార్యలే, అని వేదము చెపుతుంది - **స్త్రియ స్సతీః పుంసః.**). ఈ విధంగా శ్రీకృష్ణుడు గోపికల పాపకర్మల యొక్క శిక్షలను వారి అంగీకారముతో తాను స్వీకరించాడు. కాని ఈ సందర్భములో తమకు విధింపబడిన అన్ని శిక్షల యొక్క బాధను శ్రీకృష్ణుడు భరించడాన్ని గోపికలు అంగీకరించలేదు. శ్రీకృష్ణుడు ఈ యథార్థమును రహస్యముగా తన మనసులోనే (శ్రీకృష్ణుడు, తాను గోపికలను వారి పాపముల నుండి విముక్తి చేస్తున్నట్లు గీతలో చెప్పాడు - **అహం త్వా సర్వ పాపేభ్యో..భగవద్గీత**) దాచుకున్నా, తపస్సంపన్నులైన గోపికలు (ఋషులు) ఈ విషయమును కనిపెట్టి కృష్ణుని అడ్డుకున్నారు. తాను గోపికల శిక్షలను పరమ సంతోషముతో అనుభవిస్తానని, దుఃఖముతో కాదని చెప్పి కృష్ణుడు వారిని అనునయించాడు. అలా కాక గోపికలు తనను వారిస్తే కలిగే బాధ, అన్ని పూర్వ శిక్షలను అనుభవించేటప్పుడు కలిగే బాధకన్నా చాలా ఎక్కువ అని చెప్పాడు. ఈ కారణము చేత గోపికలు తమ శిక్షలన్నింటినీ శ్రీకృష్ణపరమాత్మపరం చేశారు.]

గోలోకేన ప్రతి ప్రేమ, ధర్మాతీత నిరూపణే |
బిందుం ప్రతి వార్ధి వార్ధిః, తృప్తః పాపఫలాగ్రహాత్ ||12.15||

[భగవంతుడు ఎప్పుడు, ఏ నియమాలను ఉల్లంఘించలేదు. భగవంతుడే ధర్మము మరియు న్యాయసూత్రాలను సృష్టించాడు కావున, తాను వాటికి అతీతుడు. ఈ సత్యమునకు ప్రత్యక్ష

సాక్ష్యాలలో ఒకటిగా, గోపికలు ధర్మవిరుద్ధముగా అందరికన్నా ఎక్కువగా, అన్నింటికన్నా మిన్నగా, చివరికి న్యాయానికి విరుద్ధంగా శ్రీకృష్ణుని ఎన్నుకోవడం ధ్రువీకరిస్తుంది. (**సర్వ ధర్మాన్ పరిత్యజ్య మామేకం శరణం వ్రజ - భగవద్గీత**). మరి ఇంతటి అవ్యాజమైన ప్రేమను గోపికలు భగవంతుని యందు ఉంచితే భగవంతుడు ప్రతిస్పందించకుండా మౌనముగా ఉండగలడా? జీవాత్మ భగవంతుని యందు ఉంచగల ప్రేమ సముద్రములో ఒక నీటిబొట్టు వంటిది. కాని భగవంతుని ప్రేమలో ఒకానొక నీటిబొట్టు పరిమితి కొన్ని కోట్లకొలది సముద్రాల వంటిది. ఇక ఆతని ప్రేమసముద్రమును గురించి ప్రత్యేకముగా చెప్పవలసినదేమున్నది? ఊహలకు సైతము అందని పరమాత్మ ప్రేమ అమోఘము, అద్భుతము. భగవంతుని ప్రేమను మానవ మేధస్సు ఎప్పటికి అర్థము చేసుకోవడం అటుంచి, కనీసం ఊహించను కూడా సాధ్యము కాదు. అటువంటి ప్రేమకు మచ్చుతునకగా గోపికల కొరకు బ్రహ్మలోకము పైన గోలోకము సృష్టించినాడు. అయినా తాను సంతుష్టుడు కాలేదు. కాబట్టి గోపికల శిక్షలను తాను తీసుకుని ఎంతో ఆనందము పొందిన విషయము వారికి తెలియనీయలేదు. ఎక్కడ భగవంతుడు వారి శిక్షలను అనుభవించాడని తెలిసి వారు బాధ పడతారేమోనని ఆ జాగ్రత్త కూడా తానే వహించాడు. కావున దానిని పూర్తిగా దాచి ఉంచినాడు. ఈ విధంగా, గోపికల పైన తన అనూహ్య ప్రేమను భగవంతుడు కురిపించాడు. నిజానికి, కృష్ణుడు వారి శిక్షలను అసలు శిక్షలుగానే భావించలేదు. గోపికల అద్వితీయ ప్రేమకు స్పందిస్తూ, వారి శిక్షలను సుఖాలుగా భావించి ఎంతో ఆహ్లాదంగా అనుభవించాడు. గోపికల పట్ల కృష్ణపరమాత్మ చూపిన అమితమైన ప్రేమను తాను పలికిన విధానములో చూడగలము. *'గోపికల శిక్షలను మోస్తున్నందుకు (ఆనందిస్తున్నందుకు) ఎవరైనా తనను ఆపినను లేదా అడ్డుకున్నను వారు పాపగ్రస్తులౌతారు. ఎందుకంటే గోపికల శిక్షలను అనుభవించే సుఖము నుండి అడ్డుతగలడమే కాక, ఎంతో ఆహ్లాదకరంగా తాను వారి*

పాపకర్మల బాధను అనుభవించనీయని కారణంగా తనకు భరింపశక్యము గాని బాధను కలిగిస్తున్నారు.' ఎంతటి ఔన్నత్యము! ఏ జీవాత్మకు గాని, ఎన్నటికి గాని, భగవంతుని ప్రేమ యొక్క గొప్పతనమును తెలుసుకొన సాధ్యము కాదు. ఎప్పటికి అయినా ఏ జీవాత్మ ప్రేమ గాని భగవంతుని ప్రేమతో సరిపోజాలదు.]

అనేక జన్మ సంస్కారో, మునీనాం ప్రేక్షణీయకమ్ |
యది నశ్చేత్ విజానీమః, యథా వర్ణస్తథా జగత్ ||12.16||

[ఋషులు స్త్రీలుగా పొందిన చిట్టచివరి జన్మ అయిన గోపికల గురించి పరమ పవిత్ర గ్రంథమైన భాగవతములో వర్ణించబడినది. కావున అట్టి గ్రంథరాజపు జ్ఞానజ్యోతి వెలుగులో మనము ఈ నాడు భగవంతుని పట్ల ఏర్పడిన బలమైన బంధముతో పోల్చుతూ మూడు బలమైన ప్రాపంచిక బంధముల మధ్య పరీక్ష గురించి విశ్లేషిస్తున్నాము. ఈ జన్మకు ముందు కోట్లాది జన్మలుగా వారు ఋషులుగా జీవనమును గడిపినారు. అందులో ఋషులు భగవంతుని గూర్చి నిరంతరాయముగా చేసిన కఠినమైన తపస్సులతో దాదాపు వారి ప్రాపంచిక బంధాలన్నీ దగ్ధమైపోవటంతో పాటు వారి శరీరసంబంధమైన హార్మోన్ల వలన కలిగిన కామవాసనలు కూడా తాపసాగ్నిలో కాలి మాడిపోయినవి. మన కన్నులలో ఋషుల యొక్క పూర్వ చరిత్రను నిలుపుకున్న తర్వాత చివరిజన్మలో గోపికలుగా వారి పరిస్థితిని చూడాలి. అప్పుడే చివరి జన్మలో వారు భగవంతునితో ప్రవర్తించిన తీరును అర్థము చేసుకొనుటకు వీలవుతుంది. ఋషుల యొక్క సుదీర్ఘ పూర్వ చరిత్ర ఆధారిత దృష్టికోణంలో జనులు గోపికలను చూడటం లేదు. కేవలము చివరిజన్మ ఆధారముగా చూస్తున్నారు, అది కూడా తమ దృష్టికోణము ఆధారముగా చూస్తున్నారు. అన్ని రకాల ప్రాపంచిక బంధాలనే బురద గుంటలో నానుతూ, భగవద్బంధము కారణముగా ఏ ఒక్క బంధము నుండి గాని విముక్తి పొందని జనులు అర్హత లేని అధమ జీవాత్మలైనందున వారి

దృష్టికోణము ఎప్పటికీ లోపభూయిష్ఠమే. ఇలాంటి దృష్టికోణముతో మరి ఎవరైనా భాగవతము లోని సందర్భమును ఎట్లు అర్థము చేసుకోగలరు? మన మనసులోని దృష్టి ఎలాంటిది అంటే కళ్ళ పైన పెట్టుకున్న రంగు కళ్ళజోడు వంటిది. కళ్ళజోడులో అద్దాల రంగు ఎరుపైతే లోకము ఎర్రగా కనబడుతుంది. అదే కళ్ళజోడు అద్దాల రంగు నీలము ఐతే లోకము నీలముగా కనబడుతుంది.]

అనిత్యః కల్పితో బంధః, విభిన్నశ్చలచిత్రయోః |
సేవాబంధ స్స్వరస్సత్యః, జనకాయ నివేదితః ||12.17||

[చలనచిత్ర నటులు వేర్వేరు చిత్రాలలో నటించేటప్పుడు వేర్వేరు బంధాలతో ఉన్నట్లే, ప్రాపంచిక బంధాలు కూడా తాత్కాలికమని, అసత్యములు అనే గొప్ప సత్యమును తెలుసుకున్న వారు ఋషులు. పాత సినిమాలలో భార్యాభర్తలుగా నటించిన ఇద్దరు నటులలో నాయిక పాత్రలో నటి, కొంత కాలము తర్వాత వయసు మీరినందుకు, వారిద్దరే తల్లీ, కొడుకులుగా నటించారు. ఈ సినిమా బంధము ఆరంభములో లేదు, సినిమా షూటింగ్ తర్వాత ఉండదు. కాబట్టి ఈ బంధము కేవలము షూటింగ్ సమయంలో మాత్రమే ఉంటుంది. అందుకే ఆదిశంకరాచార్యులు ఏదైతే తాత్కాలికమో అది అసత్యము అని బోధించినారు. (**అనిత్యం కృతకం హి లోకే**). వీరిద్దరి మధ్య ఉన్న బంధము సహనటీనటుల బంధము మాత్రమే, అదే సత్యము. ఇదే విధంగా రెండు జీవాత్మల మధ్య గల ప్రాపంచిక బంధము అసత్యమైనది, కేవలము ఈ జన్మ లోనే ఉన్నది. కావున ఈ జన్మ లో ఉన్న బంధము కూడ అసత్యము. తల్లి తన కొడుకును ప్రేమబంధముతో పెంచుతున్నప్పుడు అతని శరీరము పట్ల ఏర్పడిన మమత్వము కారణముగా తర్వాతి జన్మలో భార్యగా వచ్చినదని ఋషులు జనకమహారాజుకు తెలిపినారు. సినిమాలోను, జనకమహారాజు సభలోను రెండు పాత్రల మధ్య బంధము, ఇద్దరు జీవాత్మల మధ్య గల ప్రాపంచిక బంధములు ఏవంటే సంతానముతో బంధము (పుత్రేషణ), జీవిత భాగస్వామితో

బంధము (దారేషణ). ప్రాపంచిక బంధాలుగా జీవిస్తున్నంత కాలము ఆయా జీవాత్మలకు ధనేషణ అనే బంధము కూడా జీవిస్తుంది. భగవంతునికి, జీవాత్మకు మధ్య గల బంధము ఎటువంటిది అంటే సినిమా నటుడు మరియు నిర్మాతకు మధ్య గల బంధము వలె శాశ్వతమైనది. కాబట్టి, తుదిసందేశము ఏమిటంటే భగవంతుడు-జీవుల మధ్య ఉన్న ఒకే ఒక యథార్థమైన బంధము ఆధారముగా, ప్రాపంచిక బంధాలనే అసత్యమైన బంధాలను తుంచివేయాలి.]

ఏవం జ్ఞానాత్ సమం త్యక్తం, తస్మై పాతో నిగృహ్యతామ్ |
మూషికై ర్గేహ దాహః కిం, పరీక్షా స్థలితై ర్న కిమ్ ?|| 12.18||

[భగవంతుని బంధము ఆధారముగా ఋషులు చేసినదంతా ఎవ్వరైనా ఊహించదగినదే, ఎందుకంటే వారు న్యాయ ధర్మాలతో గల బంధములతో పాటు ఇతర ప్రాపంచిక బంధాలను అన్నింటినీ తుంచివేశారు. అంటే న్యాయ-ధర్మాలను అనుసరించి, భగవంతునితో ఏర్పడిన విశేషబంధము కారణముగా, నరకానికి వెళ్ళవలసి వస్తుందనే భయముతో వారు ఇదివరకు అనుసరించిన ప్రాపంచిక ధర్మముతో ఉండిన బంధమును పూర్తిగా వదులుకున్నారు. నివృత్తిలో మాత్రమే సంభవించే ఇటువంటి పతాకస్థాయి భక్తిని 'మహానివృత్తి' అంటారు. ఒకవేళ భగవంతుని స్థానములో అనైతిక బంధము (ఇతర ప్రాపంచిక జనులతో) ఉంటే ఇదే మహానివృత్తి, పరమ నీచమైన దుష్ప్రవృత్తిగా మారుతుంది. అంతేకాదు, దాని అంతిమ ఫలితము కూడా అత్యున్నతమైన బ్రహ్మలోకము నుండి అథఃపాతాళానికి పడిపోవడము జరుగుతుంది. ఈ రెండు శిఖర స్థానాల మధ్య, దుష్ప్రవృత్తి కంటే పైన ప్రవృత్తి ఉంటుంది, మహానివృత్తి కంటే క్రింద నివృత్తి ఉంటుంది. అతి పవిత్రమైన ఈ మార్గములో ఉన్న ఒకే ఒక భయమేమిటంటే ఇదే స్థానములో ఎవరైనా కుహనా (అసత్య) నరావతారము వచ్చి, ఇదే సూత్రముతో అమాయకులైన

భక్తులను మోసగించవచ్చును. ఇటువంటి అవకాశ దురుపయోగములు జరుగకుండా అన్నిరకములైన జాగరూకతలతో, లోతైన విశ్లేషణతో భక్తులు వ్యవహరించవలసి ఉంటుంది. కాని మోసములను ఎదుర్కొన వలసి వస్తుందనే భయముతో మనం, యథార్థమైన సందర్భములను కూడా వ్యతిరేకించి, సత్యమును అసత్యమనడము భావ్యము కాదు. ఇంట్లో ఎలుకలు పడ్డాయని ఇల్లు తగలబెట్టుకోము కదా. ఎలుకలు పట్టే పెట్టెలనో లేదా జిగురుపలకలనో ఉపయోగించి వాటిని అరికడతాము. ఏదో ఒక పరీక్ష కేంద్రములో కాపీ జరిగిందని తెలిసినపుడు పరీక్ష విధానమునే రద్దు చేయాలనుకోము కదా, కాపీని అరికట్టే జాగ్రత్తలు తీసుకుంటాము.]

సంకల్పేన ఫలం భుంక్తే, న జడేన హి కర్మణా |
దృష్టం వ్యాసేన భక్తాభ్యాం, ఫలయోః కృత కర్మణోః ||12.19||

[చేసిన కర్మలకు అనుభవించే ఫలితములను నిర్ణయించే పూర్తి బాధ్యత కర్మ వెనక ఉన్న ఉద్దేశమునకే ఇవ్వబడినది. ఎందుకంటే కర్మ జడమైనది. కావున దాని ఆధారముగా ఫలము లభించదు. ఉద్దేశము అనేది చైతన్యము యొక్క ప్రకటితరూపాలలో ఒకటి, కావున కర్మఫలితమును పొందగలదు. ఈ భావనను క్రింది రెండు ఉదాహరణలతో వివరించవచ్చును.

1. వ్యాసమహర్షి, తన తమ్ముళ్ళు ఇద్దరు మరణించగా వంశోద్ధరణ కొరకు, తల్లి ఆజ్ఞతో, వారి భార్యలతో కామకార్యము చేయవలసి వచ్చినది. ఇది పాపకర్మ కాదు, పైగా పుణ్యముగా భావింపబడినది.

2. ఇద్దరు భక్తులు కాశీ నగరప్రయాణమును ఆరంభించారు. దారిలో ఒకడు వేశ్యచేత ఆకర్షింపబడి ఆగిపోయాడు. రెండవవాడు కాశీనగరమును చేరి, ప్రతిరోజు కాశీ విశ్వనాథుని పూజించేవాడు. మొదటివాడు ఒక శివరాత్రి రోజున నగ్నంగా ఉన్న వేశ్య

కౌగిలింతలో ఉండి ప్రాణాలు కోల్పోయాడు. రెండవ వాడు శివభగవానునికి అభిషేకం చేస్తూ మరణించాడు. భగవానుడైన శివుడు తన పరిచారకులను వేశ్య వద్ద పడి చనిపోయిన వానిని తీసుకురమ్మనెను, కాశీలో చనిపోయిన వానిని యమభటులను తీసుకువెళ్ళమనెను. శివభగవానుడు ఇచ్చిన వివరమేమిటంటే, మొదటివాని జీవితములో ఎల్లవేళలా కాశీకి వెళ్ళి భగవత్సేవలో తరిస్తున్న వాని అదృష్టమునే తలుచుకునేవాడు. రెండవ వాడు అనునిత్యము మొదటివాని వేశ్యాసాంగత్యమనే అదృష్టాన్ని తలచుకునేవాడు. కావున చివరి ఫలితాలు వారి ఆలోచనల వెనక గల ఉద్దేశాలను అనుసరించి వచ్చినాయి, కాని పైకి కనిపించే జడమైన కర్మ కారణముగా కాదు.]

కర్మణ్యకర్మ గీతే తు, కర్మణో న ఫలం శ్రుతమ్ |
గోపికా మధుమత్యోశ్చ, దృష్టంతాభ్యాం
సుబోధితమ్ ||12.20||

[భగవద్గీతలో, జ్ఞాని, కర్మలో అకర్మను, అకర్మలో కర్మను అన్వేషించవలెను అని ఒక శ్లోక సారాంశము కలదు (**కర్మణ్యకర్మ..**). దీని యథార్థమైన భావమేమిటంటే, నీవు శోధించవలసినది, 1. పాపకర్మ వెనక ఉన్న మంచి ఉద్దేశములో పాపము లేదనే విషయమును చూడాలి. 2. పుణ్య కర్మ అనేచోట పుణ్యము లేకపోవటానికి కారణము ఆ కర్మకు చివరి లక్ష్యమైన, దురుద్దేశము అని తెలియాలి. కావున కర్మ స్వభావమును బట్టి అది పాపకర్మ లేదా పుణ్యకర్మ అని నిర్ణయించలేము. ఈ భావన రెండు సందర్భాలలో వివరించవచ్చును. 1. మధుమతి నిరంతరము తన భర్త అయిన భగవానుడైన దత్తాత్రేయునితో, అతని పూజా సమయమునందు కూడా కామాతురత కలిగి ఉండేది. ఇది పతితో సంబంధించినది కావున ధర్మబద్ధమైన కామము. కాని మధుమతి తన భర్త యొక్క బాహ్య సౌందర్యము చేత ఆకర్షితురాలైనది తప్ప, ఆయన భగవంతుడని గుర్తించలేదు, అతని దివ్యమైన,

ఉత్కృష్టమైన కళ్యాణగుణముల యొక్క అంతస్సౌందర్యమును గుర్తించలేదు. ఈ ధర్మబద్ధమైన కామకర్మకు ప్రతిఫలముగా ఆమెకు రాక్షసజన్మ అనే శాపము భర్తనుండియే లభించినది. 2. గోపికలు కూడా కృష్ణునితో కామకేళి కొరకు పిచ్చిగా తపించినారు. కాని వీరి కామము వెనుక అంతర్లీనమైన కారణము కృష్ణుని బాహ్య సౌందర్యము చేత ఆకర్షింపబడు హార్మోన్ల ప్రభావము కాదు. కోట్లాది జన్మల నుండి భగవంతుని కొరకు చేసిన ఘోరతపస్సు వలన జనించిన శుద్ధమైన ప్రేమ కారణముగా వారిని పెనవేసుకొన్న భగవంతుని ప్రేమ బంధము మాత్రమే. అర్ధరాత్రి, గోపికలు, శ్రీకృష్ణునితో నాట్యము చేస్తున్నప్పుడు వారికి శ్రీకృష్ణుడే భగవంతుడన్న పరమసత్యము తెలుసునని నారద మహర్షి భక్తిసూత్రములలో చెప్పినారు. గోపికల జీవితములో అనైతిక పాత్రగా కనిపించు శ్రీకృష్ణునితో జరిగినట్టి అనైతిక కామకేళి అయినా కాని, తుదిఫలితంగా బ్రహ్మలోకానికి పైన గల గోలోకము గోపికలకు దక్కినది. ఈ రెండు సందర్భాలను పరిశీలిస్తే, కర్మలకు, మనసు అంతరాళాలలో గల భావనను అనుసరించి ఫలితము లభిస్తున్నది, కాని జడమైన కర్మ స్వభావము అనుసరించి కాదు. భగవంతుని పట్ల పతాకస్థాయిలోని పిచ్చిప్రేమ ప్రేరేపించినదే ఈ కామభావన. అత్యంత ఆసక్తికరమైన విషయము ఏమిటంటే మొట్టమొదట తేజోరూప అవతారమైన దత్త భగవానుని నరావతారములే దత్తాత్రేయుడు మరియు శ్రీకృష్ణుడు. ఈ ముఖ్యమైన అంశమే రెండు భావనలలోను సజాతీయముగా ఉన్నది.]

ఇతి త్రైలోక్యగీతాయాం 'కృష్ణ తత్త్వ జ్ఞాన యోగో' నామ ద్వాదశాధ్యాయః ||

[ఈ విధంగా త్రైలోక్యగీత యందు 'కృష్ణ తత్త్వ జ్ఞాన యోగము' అనబడు పన్నెండవ అధ్యాయము పరిసమాప్తము.]